
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 | కనిష్ఠం : 20.0






ధరూర్ పీహెచ్‌సీ




# పొలిటికల్.. హీట్

- పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్తబ్దుగా పార్టీలు
- తాజాగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు ప్రారంభం
- రైతాంగ నిరసన పేరుతో వనపర్తిలో మాజీ మంత్రి హరీశ్‌రావు సభ
- పాలమూరులో మాజీ మంత్రి ఆధ్వర్యంలో ధర్నా
- అరెస్టులు, వివాదాల నేపథ్యంలో పార్టీల మధ్య రచ్చ



మహబూబ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల తర్వాత పార్టీల మధ్య పోరు స్తబ్దుగా మారింది. రాష్ట్ర స్థాయిలో ఆరోపణలు, ప్రత్యారోపణలు జరుగుతున్నప్పటికీ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల మధ్య విమర్శలు ఉండటం లేదు. కానీ ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం దూకుడు పెంచుతున్నారు. కొందరు రాష్ట్రస్థాయి అంశాలను ప్రాతిపదికగా చేసుకుని జనంలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా.. మరికొందరు జిల్లా స్థాయిలోని అంశాల ఆధారంగా నిరసన ప్రదర్శనలకు పిలుపునిస్తున్నారు. ఇటీవల వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుబంధు, రుణమాఫీ అమలు తీరుపై రైతాంగ నిరసన సభ ఏర్పాటు చేయగా.. మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సభ జరగడం ఇదే మొదటిసారి అని చెప్పొచ్చు. అయితే దానిపై అధికారపక్షం నుంచి కూడా భారీగానే కౌంటర్లు వచ్చాయి. బీఆర్ఎస్ హయాంలో రుణమాఫీ తీరు, అభివృద్ధిపై చర్చకు సవాళ్లు వచ్చాయి. అక్రమ అరెస్టులు, పోలీసుల వేధింపులు బీఆర్ఎస్‌పై ఉన్నాయని ఆరోపిస్తూ తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా.. చేశారు. రోజుకో ముఖ్య నాయకుడిని తీసుకువచ్చి జనంలోకి చర్చ వెళ్లేలా కార్యాచరణను అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా శ్రీనివాస్‌గౌడ్ హయాంలో అక్రమాలు, అన్యాయాలు జరిగాయని పత్రికా సమావేశాల ద్వారా ఖండిస్తూనే ఉన్నారు.

**523 సర్వే కేంద్రంగానే..**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 523 సర్వే నెంబర్ వివాదం చాన్నాళ్లుగా ఉంది. అక్రమ పట్టాలు, నకిలీ పట్టాలు పేరు

(మిగతా 7లో..)

## కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రావొద్దు



కానాయపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం మండలంలోని కానాయపల్లి శివారులో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని, సన్నరకం, దొడ్డురకం వడ్లను ఎలా గుర్తిస్తున్నారని సిబ్బందిని అడిగారు. డిజిటల్ క్యాలిపర్ యంత్రం ఉపయోగం విధానాన్ని పరిశీలించారు. సన్నరకం వడ్లకు 14 శాతం, దొడ్డు రకం వడ్లకు 17 శాతంలోపు తేమ కలిగి ఉండాలన్నారు. సన్నరకం ధాన్యానికి రూ. 2,300లతో పాటు రూ. 500 ప్రభుత్వం బోనస్ ఇస్తుందని తెలిపారు. తూకం చేసిన ధాన్యం బస్తాలను వేర్వేరుగా ఉంచాలని ఆదేశించారు. కల్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు తూకం చేసిన బస్తాలు తడిసి పోకుండ ఉండేందుకు కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తూకం చేసిన బస్తాలపై కొనుగోలు కేంద్రం రిజిస్టర్ నంబరు, క్రమసంఖ్య సన్నరకం, దొడ్డురకం అనేది ముద్రించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు సింగిల్ విండో సీఈవో బాలరాజు ఉన్నారు.

## పెరుగుతున్న మాతృమరణాలు

- ధరూర్ మండలంలోనే ఐదు కేసులు
- అధికమవుతున్న శిశు మరణాలు
- చోద్యం చూస్తున్న వైద్యాధికారులు



శివలీల మృతికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

గద్వాల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో కొంతకాలంగా మాతృ మరణాలు, శిశు మరణాల సంఖ్య పెరుగుతూ వస్తున్నాయి. ఈ విషయంలో జిల్లా వైద్యాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్ ఈ మరణాలపై ఆరా తీసినట్లు సమాచారం.

జిల్లాలోని ధరూర్ మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒకటి ధరూర్, మరొకటి ఉప్పేరు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఉప్పేరు పీహెచ్‌సీ పరిధిలో ఉప్పేరుకు చెందిన ఎస్.నాగలక్ష్మి, జ్యోతి, ముల్కలపల్లికి చెందిన ఆఫ్రిన్, కుర్వపల్లికి చెందిన శివలీల వైద్య సేవలు పొందారు. ధరూర్ పీహెచ్‌సీ పరిధిలో కోతులగిద్దకు చెందిన టీ. సుజాత వైద్యసేవలు పొందారు. నాగలక్ష్మి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో, ఆఫ్రిన్ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో, శివలీల కర్నూల్ ఆసుపత్రిలో, టీ సుజాత దాసరిపల్లి నుంచి గద్వాలకు వస్తుండగా మార్గమధ్యలో, జ్యోతి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి(మాతృమరణాలు) చెందారు. ఇవి ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు అధికారికంగా నమోదైన కేసులు మాత్రమే. అక్టోబరులో ఒకటి రాజోలిలో జరిగినట్లు సమాచారం. వీటితో పాటు ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 38 శిశు మరణాలు జరిగినట్లు తెలుస్తోంది. మాతృ, శిశు మరణాలు జరుగుతున్నా వైద్యాధికారులు స్పందించడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**కలెక్టర్ సీరియస్...**

ఇటీవలే వైద్య సిబ్బందితో కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మాతృమరణాలపై కలెక్టర్ వైద్యసిబ్బందిపై సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఎక్కువగా ధరూర్ మండలంలోని పీహెచ్‌సీలో మాతృమరణాలు జరగడంతో సంబంధిత అధికారిమీద చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

**డాక్టర్ల కొరత కూడా ప్రధాన కారణం**

కొంతకాలంగా జిల్లా ఆస్పత్రిలో గైనిక్ డాక్టర్ల కొరత ఉంది. జిల్లాలోని ఇతర పీహెచ్‌సీలలో హైరిస్క్ ఉన్న గర్భిణులను జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఇక్కడ కేవలం ఇద్దరే డాక్టర్లు ఉండటంతో ఇతర ప్రాంతాలకు, లేదా ప్రవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లే క్రమంలో కూడా మాతృమరణాలు జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.




**మాతృ మరణాలు జరుగకుండా చర్యలు**

జిల్లాలో కాన్పుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం. అయితే గైనిక్ డాక్టర్ల కొరత ఉన్న మాట వాస్తవమే. కలెక్టర్ ఆదేశాల మేరకు డాక్టర్లను నియమించేందుకు నోటిఫికేషన్ వేశాం. అంతేకాకుండా మాతృ, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ సిద్దప్ప, డీఎంహెచ్‌వో

## ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి

- కలెక్టరేట్ ముందు రైతుల ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న రైతులు

6

## కష్టపడ్డారు.. సాధించారు

పట్టుదలతో ఏకంగా నాలుగైదు ఉద్యోగాలకు అర్హత సాధించారు.. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని నిరూపించారు. వారు పట్టుదలతో విద్యాభ్యాసం కొనసాగించి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగైదు ఉద్యోగాలకు అర్హత సాధించారు.. పేదరికం, కష్టాలను ఎదురించి పట్టుదలతో చదివి ఉద్యోగాలు రాబట్టారు. అలాంటి వారిపై ఈ కథనాలు..

బిజినేపల్లి/పదర/మదనాపురం(ఆంధ్రజ్యోతి)

6

## రైతుబంధు, రుణమాఫీ అమలు చేయాలి

- గద్వాల కలెక్టరేట్ ముందు కర్నూలు రైతుల ధర్నా
- గత ప్రభుత్వంలో తమకు అమలు చేశారు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు కావడంలేదని ఆందోళన

7

## శివపార్వతుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు



ఉత్సవ మూర్తులకు పాపనాశిని గుండంలో పుణ్య స్నానాలు చేయిస్తున్న అర్చకులు

6

## నీటి కుంటలో పడి వృద్ధుడి మృతి



లక్ష్మయ్య (ఫైల్)

అమ్రాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న నీటి కుంటలోకి స్నానానికి వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే తిరుమలాపూర్ చెందిన లక్ష్మయ్య (61) సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న నీటి కుంటలో స్నానానికి వెళ్లి కుటుంబ సభ్యులు చూస్తుండగానే మునిగిపోయాడు. గ్రామస్థులు నీటి కుంటలో వెతకగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. అతడి ఒంటిపై ఉన్న పంచె కాళ్లకు చుట్టుకోవడంతోనే నీటిలో మునిగి మృతి చెంది ఉంటాడని వారు వెల్లడించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

## ఈ ఊర్లో అందరూ.. వంట మాస్టర్లే!

- భూత్పూర్ మండలం, అన్నసాగర్ ప్రత్యేకత
- ఇదే వృత్తిలో దాదాపు 150 కుటుంబాలు
- రుమాల్ రోటీ మాస్టర్లుగా మరో 30 మంది



రుమాల్ రోటీని తయారు చేస్తున్న మాస్టర్

మీ ఇంట్లో పెళ్లయినా, గృహ ప్రవేశమైనా, ఇంకా ఏ ఇతర శుభకార్యమైనా సరే.. మంచి వంట మాస్టర్ల కోసం పెద్దగా ఆలోచించనక్కర లేదు.. మీరు ఆ ఊరికి వెళ్తే చాలు.. అక్కడ ఇంటికో వంట మాస్టర్ ఉంటాడు. సహాయకులు కూడా అక్కడే ఉంటారు.. మీరు వెళ్లి మాట్లాడుకుంటే సరిపోతుంది.. ఆ ఊరే అన్నసాగర్. ఈ గ్రామం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో ఉంది. ఆ ఊరి కథ ఏంటి? వంట వృత్తిని ఎవరు ప్రారంభించారు. ఎక్కువ మంది ఆ వృత్తిలోకి ఎలా వచ్చారు? తదితర వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

- భూత్పూర్ (ఆంధ్రజ్యోతి)

7



భూత్పూర్‌లోని ఓ జీపీ లేఅవుట్

## రియల్ డీలా..

- గ్రామ పంచాయతీ లేఅవుట్‌ల నిషేధంతో కుదేలైన రియల్ రంగం
- రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లకు ఇప్పటికీ కాని రిజిస్ట్రేషన్
- రూ.లక్షలు డబ్బులు ఇచ్చి రియల్టర్ల చుట్టూ తిరుగుతున్న కస్టమర్లు
- ఉమ్మడి పాలమూరులో నిలిచిన లక్షల ప్లాట్ల క్రయవిక్రయాలు
- వ్యాపారం లేక ఉపాధి కోల్పోతున్న మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్

● జడ్చర్లకు చెందిన ఓ మహిళ 16 నెలల క్రితం రూ.12 లక్షలు ఇచ్చి ప్లాట్ కొనుగోలు చేశారు. ఇప్పటివరకు ఆ ప్లాట్ రిజిస్ట్రేషన్ కాలేదు. అటు డబ్బులు జామ్ అయ్యి, ఇటు రిజిస్ట్రేషన్ లేక సదరు కుటుంబం రియల్ వ్యాపారుల చుట్టూ తిరుగుతోంది. రిజిస్ట్రేషన్ చేస్తారా?.. మా డబ్బులకు ఇంట్రెస్ట్ కలిపి ఇస్తారా అంటూ వారితో గొడవకు దిగారు.

........................

● మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ చిరు వ్యాపారి భూత్పూరు శివారులో రెండేళ్ళ క్రితం రూ.10 లక్షలు ఇచ్చి 165 గజాల స్థలం కొనుగోలు చేశాడు. ఇప్పటికీ రిజిస్ట్రేషన్ కాలేదు. ఎవరికైనా అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ కాదని ఎవరూ ముందుకు రావడం లేదు. పెట్టిన డబ్బులు వాపస్ ఇవ్వాలని లేఅవుట్ చేసి వారి దగ్గర గొడవ పడుతూనే ఉన్నాడు. ఇలాంటి బాధితులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలల్లో ఉన్నారు.

(వార్త 7లో..)

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఉండవల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో జోనల్ స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలు
- ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



ఉండవల్లి జడ్పీహెచ్ఎస్ మైదానంలో అండర్ 14 కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవల్లి, నవంబరు 4: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం ఉండవల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అలంపూరు ఎమ్మెల్యే విజయుడు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, జీహెచ్ఎం హేమలతతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయినుంచి క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలన్నారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. అంతకుముందు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించి కబడ్డీ ఆడారు.

**విజేతలుగా వనపర్తి, నాగర్‌కర్నూలు**

ఉండవల్లిలో జరిగిన జోనల్ స్థాయి అండర్-14, బాలురు, బాలికల విభాగంలో కబడ్డీ పోటీలు హోరాహోరిగా జరిగాయి. వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాల జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో వనపర్తి జిల్లా జట్టు విజేతగా నిలువగా నారాయణపేట జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలురు విభాగంలో నాగర్‌కర్నూలు జిల్లా జట్టు మొదటిస్థానాన్ని కైవసం చేసుకుంది. మహబూబ్‌నగర్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. విజేతలకు మెమెంటోను, సర్టిఫికేట్‌ను అందజేశారు. జోనల్‌స్థాయిలో గెలుపొందిన జట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి జట్టులో అవకాశం కల్పిస్తామని కార్యదర్శి జితేందర్ అన్నారు. క్రీడా కారులకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కలుగొట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, వివిధ పాఠశాలల పీడీలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించిన భక్తులు



అలంపూరు ఆలయం సమీపంలో నదీమ తల్లికి నది హారతి ఇస్తున్న పూజారులు

## బాల బ్రహ్మేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

- కృష్ణానదిలో స్నానాలు ఆచరించిన భక్తులు
- జనం రద్దీతో కిటకిటలాడిన ఆలయాలు

అలంపూరు/కొల్లాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని అలంపూరు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా తుంగభద్రా నది పుష్కర ఘాట్ దగ్గర స్నానాలు ఆచరించి నదిలో, స్వామి, అమ్మవారి ఆలయం ముందు కార్తీక దీపాలు వెలిగించి బాల బ్రహ్మేశ్వర స్వామికి అభిషేకాలు, అమ్మవారికి అర్చనలు చేశారు. దేవస్థానం వారు సాయంత్రం నదిహారతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు మహిళలు జ్యోతి ప్రజ్వళన చేసి, పసుపు కుంకుమ, రవిక వితరణ చేశారు. అనంతరం నదీమ తల్లికి దశవిధ నదీ హారతి ఇచ్చారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమశిల లలితాంబిక సోమేశ్వర ఆలయంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి భక్తులు పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య ఆలయాల్లో అభిషేకాలు, అర్చనతో పాటు ఉసిరి చెట్టు కింద కుటుంబ సమేతంగా పూజలు చేశారు. సింగోటం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు.

## త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



రోడ్డుపైనే దగ్ధమైన గడ్డి

రేవల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్‌లో మంటలు చెలరేగిన సంఘటనలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ మండలం గన్యాగుల గ్రామానికి చెందిన రైతులు సోమవారం వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని రేవల్లిలోని పొలాల వద్ద గడ్డిని ట్రాక్టర్‌పై వేసుకుని రోడుపైకి వెళ్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ట్రాక్టర్ జాకీలేపి గడ్డిని కిందకివేసి ట్రాక్టర్‌ను ముందుకు తీసుకెళ్లాడు. దీంతో ట్రాక్టర్‌కు, ట్రాక్టర్‌పై ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది. ఈ విషయంపై విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా విద్యుత్ వైర్లు తగిలి ఉంటపోవచ్చని అన్నారు.

సదా మీ సేవలో..



అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

| | |
|---|---|
| గద్వాల జిల్లా | :9985404383 |
| మహబూబ్‌నగర్ జిల్లా: | 8096677362 |
| నాగర్‌కర్నూల్ జిల్లా | :8374394441 |
| నారాయణపేట జిల్లా | :9985456557 |
| వనపర్తి జిల్లా | :9010937550 |

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

# జోరుగా పప్పుశనగ సాగు

● ఇటీవల కురిసిన వర్షాలకు పదునెక్కిన పొలాలు



ఇటిక్యాలలో ట్రాక్టర్ ద్వారా పప్పు శనగ విత్తనాలు వేస్తున్న రైతులు

ఇటిక్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షాలు సకాలంలో రావడంతో నల్లరేగడి పొలాలు అదునుకు పదునెక్కడంతో పప్పు శనగ పంట సాగుకు రైతులు మొదలు పెట్టారు. ఇటిక్యాల మండలంలో షాబాద, చాగాపురం, పెద్దదిన్నె, ఇటిక్యాల, వేముల, వల్లూరు తదితర గ్రామాల్లో పప్పుశనగ సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సైతం మదతు ధర ప్రకటించడంతో ఈ ఏడాది అలంపూరు నియోజక వర్గంలో పంట సాగు పెరిగినట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. గత నెలలో అధిక స్థాయిలో వారం రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు రావడం భూములకు తేమ ఎక్కువ కావడం లోతట్టు భూములు బురద మయం అయ్యాయి. మిట్ట పొలాల్లో తేమ ఆరిపోవడంతో రైతులు విత్తనాలు వేయడం మొదలు పెట్టారు. ఎకరాకు 50 కేజీల వరకు విత్తనాలు అవసరం వుండటంతో రైతులు ఇప్పటికే సేకరించుకున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.8 వేల వరకు ఉంటుందన్నారు. పొలాల్లో విత్తనాలతో పాటు రసాయనికి ఎరువులు వేయడం జరుగుతుందని రైతులు అంటున్నారు. అదును దాటిన తరువాత విత్తనం సాగు ఫలితం ఉండదని, ఈనెల మొదటి వారం లోపు విత్తనం పూర్తి కావాలని రైతులు తెలుపుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి ఖరీఫ్‌లో వేసిన కంది పంట నీట మునిగి తీవ్రంగా నష్టవాటిల్లింది. పలు గ్రామాల రైతులు ఎండిన పంటను తొలగించి పప్పు శనగ పంట సాగు చేస్తున్నారు. యాసంగి పంట కావడంతో వర్షంతో పనిలేకుండానే చలికి పంట వస్తుందని రైతులు చెబుతున్నారు.

● ఆరు ఎకరాల్లో పంట సాగు



అధిక వర్షాలతో పొలాలు పదునెక్కాయి, నాలుగు ఎకరాల్లో పప్పు శనగ పంట సాగు చేశాను. ఎకరాకు 8 నుంచి 12 వేల వరకు ఖర్చు ఉంటుంది. నల్ల రెగడి పొలాల్లో పప్పు శనగ పంట సాగు చేయడం వల్ల దిగుబడి బాగానే వుంటుంది.

- రైతు మాసన్న ఇటిక్యాల

## మనస్తాపంతో రైతు ఆత్మహత్య

ఖిల్లాఘణపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రైతు వరుదా రెడ్డి (53) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం వ్యవసాయ పొలానికి బాట విషయమై గొడవ జరగడంతో తన వ్యవసాయ పొలం వద్ద మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరిపల్లి గ్రామ శివారులో తన వ్యవసాయ పొలానికి వరి కోత మిషన్ పోవడానికి బాట వదలాలంటే రోడ్డుకు మట్టి కొట్టడానికి అయిన ఖర్చును ఇవ్వాలని పక్కపొలం రైతులు కలిసి గ్రామంలో ఆదివారం పంచాయితీ చేశారు. మృతుడు గతంలో బాట గుంతలుగా ఉన్నప్పుడు స్వయంగా వేశానని, అప్పుడు ఎవరూ డబ్బులు ఇవ్వలేదని వారితో వాదించినట్లు తెలిపారు. కాగా, సోమవారం ఉదయం మృతుడి ఇంటికి ఒక మనిషిని పంపించి డబ్బులు వసూలు చేయాలని, లేకుంటే వరి కోత మిషన్‌ను బాట ద్వారా వెళ్లనివ్వమని పరిసర రైతులు తెలిపినట్లు తెలిసింది. చేతికి వచ్చిన వరి పంట కోసుకోవడానికి వరి కోత మిషన్ రానివ్వకుండా అభ్యంతరాలు తెలుపుతున్నారని ఆవేదనతో మనస్తాపం చెందిన వరుదారెడ్డి తన సొంత వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

# కష్టపడ్డారు.. సాధించారు

» కష్టంతో పాటు కృషిని నమ్ముకున్నారు..

» ఉన్నత చదువులతో ఏకంగా నాలుగైదు ఉద్యోగాలు సాధించారు..

వారు పేదరికాన్ని పట్టుదలతో జయించారు.. ఉన్నత చదువులతో ఏకంగా నాలుగైదు ఉద్యోగాలు సాధించారు.. ఏదైనా సాధించాలన్న తలంపు ఉంటే దానికి పట్టుదల ముఖ్యం.. అలా జీవితంలో ముందడుగు వేయాలంటే ఉన్నత చదువూ అంతే ముఖ్యం. ఆ కోణంలోనే వారు విద్యాభ్యాసం కొనసాగించి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగైదు ఉద్యోగాలు సాధించారు.. పేదరికం వెన్నాడుతున్నా కష్టాలను ఎదురించి పట్టుదలతో చదివి ఉద్యోగాలు రాబట్టారు. అలాంటి వారిపై ఈ కథనాలు..

## వరుసగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత



గొల్లం సూరయ్య

పదర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒకే సంవత్సరంలో వరుసగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నల్లమల యువకుడు గొల్లం సూరయ్య. పదర మండల కేంద్రంలో గొల్లం మల్లయ్య, పార్వతమ్మల రెండవ సంతానం. తన విద్యాభ్యాసం బాల్యం నుంచి 10వ తరగతి వరకు అక్కడే కొనసాగించారు. అనంతరం పై చదువులకోసం హైదరాబాద్ వెళ్లారు. ఉస్మానియాలో పీజీ (ఫిజిక్స్) అభ్యసిస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతుండే వారు. ఇటీవలే విడుదలైన గురుకుల జూనియర్ లెక్చరర్, పీజీటీ (ఫిజికల్ సైన్స్), టీజీటీ (ఫిజికల్ సైన్స్), టీఎస్‌పీఎస్ జూనియర్ లెక్చరర్(గజిటెడ్) ప్రభుత్వ ఉద్యోగాలు ఫలితాల్లో నాలుగింటికి అర్హత సాధించడం పట్ల గ్రామస్థులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' సూరయ్యతో మాట్లాడగా ఐఏఎస్ కావడమే నా లక్ష్యమని తెలిపారు. ఈ విజయాల వెనుక తన తల్లిదండ్రులతో పాటు అన్న గొల్లం ఎల్లయ్య సపోర్ట్ నా తుదిశ్వాస వరకు మరువలేనిదన్నారు. గ్రామస్థులు, స్నేహితుల తోడు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కోరారు.

## పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదు

» ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన జీవన్

» బట్టలు కుడితే తప్ప బతుకు బండి నడవని పరిస్థితి





ఐదు ఉద్యోగాలు సాధించిన జీవన్‌కుమార్‌ను అభినందిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు గంగనమోని స్వాతి, కిరణ్(ఫైల్)

బిజినేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ జీవించిన మాకం జీవన్ కుమార్ పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. పేదరికం అడ్డురాదని ఒకసారి ఐదు ఉద్యోగాలకు ఎంపికై ఆదర్శంగా నిలిచాడు. తల్లిదండ్రులు మాకం అంజనేయులు, లావణ్యలు నిరుపేదలు. రోజు బట్టలు కుడితే గాని బతుకు జట్కాబండి నడవని దయనీయ పరిస్థితి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో టైలర్‌గా జీవనం సాగిస్తున్న అంజనేయులు, లావణ్య దంపతులకు కూతురు మహిత, కుమారుడు జీవన్ కుమార్. ఇంటర్ వనపర్తిలో చదివి ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించాడు. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసిన జీవన్ కుమార్ ఎంటెక్ హైర్యానా రాష్ట్రంలో చదివాడు. పీజీ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన ఉద్యోగ నియామక పరీక్షలకు దరఖాస్తులు చేశాడు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్ మొదలు పెట్టాడు. కష్టాలు పడుతున్న తల్లిదండ్రులకు ప్రభుత్వ ఉద్యోగం బహుమతిగా ఇవ్వాలని లక్ష్యంతో పట్టుదల చదివి ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు.

- ఎంపికైన ఐదు ఉద్యోగాలు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), నియామక పరీక్షలో స్టేట్ 4వ ర్యాంకు. అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)లో స్టేట్ 26వ ర్యాంకు, పాలిటెక్నిక్ లెక్చరర్ నియామక పరీక్షలో స్టేట్ 24వ ర్యాంకు, గ్రూప్-4లో జిల్లా 9వ ర్యాంకు, సెంట్రల్ గవర్నమెంట్ పరిధిలో ఎస్ఎస్‌సీ ద్వారా నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ జూనియర్ ఇంజనీర్(జేఈ)గా జాతీయ స్థాయిలో 191వ ర్యాంకు సాధించాడు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు సిద్ధం అవుతున్నాడు.

విద్యార్థులకు పాఠాలు చెబుతున్న దేవా



## మట్టిలో మాణిక్యం దేవా

» ఓపెన్ ద్వారా పీజీ పూర్తి - ఒకేసారి నాలుగు ఉద్యోగాలు

మదనాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంకల్పం ఉంటే మనిషి జీవితంలో ఏదైనా సాధించవచ్చని నిరుపించాడు బడుగుల దేవా. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని నర్సింగాపురం గ్రామం దేవా స్వస్థలం. ఒకటి నుంచి అయిదు వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి ఆరు నుంచి ఎనిమిది వరకు మదనాపురం పాఠశాలలో చదివాడు. చదవాలనే ఆశ ఉన్నా పేదరికం అడ్డు రావడంతో తల్లిదండ్రులతో కలిసి పని చేయడానికి వలస వెళ్లాడు. ఓవైపు పనులు చేస్తూనే రాత్రి వేళల్లో దినపత్రికలు, పుస్తకాలు చదవడం ఆసక్తిగా మలుచుకున్నాడు. అదే ఆసక్తితో ఓపెన్‌లో టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. బీఈడి ఎంట్రెన్స్‌లో 140వ రాష్ట్ర ర్యాంకు సాధించి పూర్తి చేశాడు.

**పీజీ ఎంట్రెన్స్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్**

బీఈడీ అనంతరం పీజీ హిస్టరీ ఎంట్రెన్స్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు. పీజీని ఉస్మానియాలో పూర్తి చేసి డీఎస్సీ చదవడం మొదలు పెట్టాడు. గురుకుల ఉపాధ్యాయ ఫలితాల్లో పీజీటీ, టీజీటీ రెండు ఉద్యోగాలు సాధించాడు. అదే విధంగా హాస్టల్ వార్డెన్ ఉద్యోగం వచ్చింది. పీజీటీ టీచర్‌గా వనపర్తి మండలం చిట్యాల గురుకులంలో పని చేస్తూ డీఎస్సీ పరీక్ష రాశాడు. డీఎస్సీలో జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్ట్‌లో జిల్లా రెండవ ర్యాంకు సాధించడంతో పీజీటీకి రిజైన్ చేశాడు.

**చదివిన బడిలోనే ఉపాధ్యాయునిగా....**

తాను పాఠం నేర్చుకున్న మదనాపురం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయునిగా చేరి విద్యార్థులకు పాఠాలు నేర్పడం ప్రారంభించాడు. ఈ సందర్భంగా దేవా ప్రతిభను చూసి ప్రతీ ఒక్కరు అభినందిస్తున్నారు.



పొలం పనులు చేస్తున్న దేవా

## ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి

» గద్వాల కలెక్టరేట్ ముందు రైతుల ధర్నా

» సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గద్వాల న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెద్దధన్వాడ శివారులో 29 ఎకరాల పంట భూమిలో వేస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెద్దధన్వాడలో సర్వెనెంబర్ 174/1, 174/ఏ/1,174/ఏ2.174/బి. 174/బి/2,లో గల 29 ఎకరాల పంట భూమిలో వేస్తున్న ఇథనాల కంపెనీ(గాయత్రి, రెన్యూవబుల్ ప్యూయల్స్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్) మా గ్రామ ప్రజలకు ఎవరికీ తెలియకుండానే నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ ఇథనాల్ కంపెనీ వలన మా పెద్దధన్వాడ గ్రామమే కాకుండా చుట్టూ ఉన్న చిన్నధన్వాడ, ననసూరు, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, నౌరోజీ క్యాంపు, వేణిసోంపురం, కేశవరం, తుమ్మిళ్ల, పచ్చర్ల, తనగల, పెద్దతాండ్రపాడు, రాజోలి గ్రామాలు కూడా కంపెనీ నుంచి వచ్చే కాలుష్యం, వ్యర్థాల వల్ల మా గ్రామ పంట పొలాలు బీడుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ జలాల వల్ల క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ఈ కంపెనీని రద్దు చేయాలని, లేదంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వీరికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించి కంపెనీ రద్దు చేయాలని కోరారు. ఈ ధర్నాలో రైతులు కమలాకర్, రజిని కుమార్, రాజు, వినోద్, బాగ్యరాజు, సందీప్‌కుమార్, రాజు, సూరి, ప్రవీణ్, యాకోబు, జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాసగౌడు

## కురుమయ్యా.. మన్నించు

» రాజగోపురం పక్కనే అశుద్ధం

» శిథిలమైన ముక్కెరవంశపు రాజుల కాలం నాటి బిల్డింగ్

» స్వామి పాదాల గుహపక్కనే దుర్వాసన వెదజల్లుతున్న వైనం

స్వామి పాదాల గుహ పక్కనే ఉన్న శిథిలమైన బిల్డింగ్



చిన్నచింతకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీనివాసుని ప్రతిరూపమైన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తిరుమల శ్రీనివాసుని ప్రతిరూపంగా పిలువబడుతున్న కురుమూర్తిరాయుడి క్షేత్రం కూడా ఎంతో పరమపవిత్రమైనది. అయితే ఇక్కడ కురుమూర్తిస్వామి గుట్టకింది భాగంలోని ప్రధాన రాజగోపురం పక్కనే ఉన్నటువంటి ముక్కెరవంశపు కాలంలోని బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకుంది. బిల్డింగ్ అంతా కుంగిపోయింది. బీటలు వారుతున్నది. పగుళ్లు ఏర్పడింది. ఎప్పుడు కూలుతుందోనన్న గుబులు భక్తులను వెంటాడుతున్నది. అయితే ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరటంతో, అందులోకి భక్తులు మలమూత్రాలు విసర్జించటం పలువురికి విస్మయం కల్గిస్తున్నది. తిరుమలలో స్వామి పాదాలు ఉన్నట్లుగానే శిథిలమైన బిల్డింగ్‌కు పక్కనే గుహలో స్వామి పాదాలు ఉన్నాయి. చాలా మంది భక్తులు పాదాలు దర్శించుకుని, అనంతరం స్వామి వారి గుట్టమీదకు వెళ్లి ఆ కురుమూర్తిరాయుడిని దర్శించుకుంటారు. అయితే భక్తుల మనోభావాలకు దెబ్బతీసేవిధంగా పాదాల గుహసమీపంలోనే మలమూత్ర విసర్జనలతో అక్కడ కంపుకొడుతున్నా, దీనిపై అటు అధికారులు, పాలకరవర్గం సభ్యులు, సంబంధిత సిబ్బంది దీనిపై నిర్లక్ష్యంగా ఉండటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతర మైదానంలో విడిదిచేసే భక్తులు అక్కడే మలమూత్ర విసర్జనలు చేస్తున్నా తమకేం పట్టనట్లుగా సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అధికారుల తీరు నిండా నిర్లక్ష్యంగా కన్పిస్తున్నది. అయితే భక్తులు మలమూత్ర విసర్జనలకు వెళ్లకుండా ఇనుపకంచెలను గుట్టసమీపంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు తెలుపుతున్నారు.

**శిథిలమైన బిల్డింగ్‌కు మరమ్మతులు చేపట్టాలి...**

రాజగోపురం వద్దగల స్వామి పాదాలచెంతనే మలమూత్రవిసర్జనలు చేయటం బంద్ కావాలంటే అక్కడ శిథిలమైన బిల్డింగ్‌కు మరమ్మతులు చేపట్టి, దానికి రంగులు వేసి, చుట్టూ కంచెను ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉద్దాల ఉత్సవం వచ్చే సమయంలోనే కాకుండా బ్రహ్మోత్సవాలకు లక్షల మంది భక్తులు అక్కడే విడిదిని ఏర్పాటు చేసుకుని ఉంటారు. అయితే ప్రమాదవశాత్తు బిల్డింగ్ కుప్పకూలితే పెద్ద ప్రాణనష్టం కూడా వాటిల్లే అవకాశం ఉందని భక్తులు ఓకింత ఆందోళన చెందుతున్నారు. ఉద్దాలోత్సవం కూడా ఇక్కడి నుంచే భక్తులు తిలకిస్తారు. ప్రమాదం జరుగకముందే అధికారులు, పాలకరవర్గం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



శిథిలమైన ముక్కెరవంశపు రాజులకాలంనాటి బిల్డింగ్



అపరిశుభ్రంగా మారిన ప్రదేశం..

### చాలీచాలని షెడ్లు

» చెట్ల కిందే భక్తుల నైవేద్యాలు

కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు చాలీచాలని రేకులషెడ్లతో ఇక్కట్లు పడుతున్నారు. కురుమూర్తి స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైనది దాసంగాల నైవేద్యం. అయితే ఈ దాసంగాలు వండేందుకు నిలువనీడ కూడా కరువైంది. దాంతో భక్తులు జాతర మైదానంలోని చెట్లను ఎంచుకుంటున్నారు. భక్తుల రద్దీకి తగ్గ షెడ్లు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయితే ప్రతి ఏటా కోట్లలో స్వామి వారికి ఆదాయం సమకూరుతున్నా, భక్తులకు సౌకర్యాలు కల్పించటంలో అటు దేవాదాయ శాఖ, పాలకవర్గం దృష్టి సారించటం లేదన్న విమర్శలున్నాయి. ఒక వేల వర్షం వచ్చిందంటే భక్తులకు మరింత ఇబ్బందులు తప్పవు. అయితే అధికారులు, పాలకవర్గం సభ్యులు భక్తుల సౌకర్యార్థం మరిన్ని రేకుల షెడ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.



కురుమూర్తి జాతర మైదానంలో చెట్లకిందే నైవేద్యాలు చేస్తున్న భక్తులు(ఫైల్)

## శివపార్వతుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు

అచ్చంపేటఅర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర క్షేత్రంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను పల్లకిసేవలో ఊరేగించారు. సోమవారం కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాదు, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలనుంచే కాకుండా ఇతర ప్రాంతాలనుంచి ఉమామహేశ్వరుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాపనాశిని గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి, అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.

వేద పండితులు రామూర్తి, వీరయ్య రాజశేఖర్, ఆనంద్‌శర్మ, చంద్రశేఖర్, ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివ పార్వతులకు కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు పల్లకిలో భజనలు, కీర్తనలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఉత్సవ మూర్తులకు పాపనాశిని గుండంలో చక్రస్నానాలు చేయించి పల్లకిలో ఆలయం వద్దకు తీసుకెళ్లి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శ్రీనివాసరావు, ఆలయం కమిటీ చైర్మన్ భీరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను చేశారు.

అయనతో పాటు ఆలయ సిబ్బంది రామకృష్ణ, లక్ష్మీనారాయణ, కవికుమార్, శంకర్, దామోదర్ ఉన్నారు.



ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

## వడ్డెర రాజేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి

మల్దకల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాలు కోల్పోయిన బాలిక వడ్డెర రాజేశ్వరి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. మల్దకల్ మండల పరిదిలోని బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డెర బాలిక ఇటీవల అవమాన భారంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బిజ్వారం గ్రామానికి చేరుకుని బాధిత బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజేశ్వరిని వేధింపులకు గురిచేయడమేగాక దొంగతనం నేరం మోపడంతో అవమాన భారం తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని దీనికి కారణమైన సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు అత్యుత్సాహం చూపి బాలిక కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురిచేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు రంజిత్‌కుమార్, బుచ్చిబాబు, వెంకట్రాములు, గట్టు, ధరూర్ మండలాల అధ్యక్షులు విష్ణు బలరాం, నజీముల్లా ఆంజనేయులు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## డబ్ల్యూటీఎం సదస్సుకు జిల్లా ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ టూరిజం సదస్సులో పాల్గొనేందుకు జిల్లా ఎమ్మెల్యేలు సోమవారం లండన్‌కు బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి 5,6,7వ తేదీల్లో లండన్‌లో జరగనున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో తెలంగాణలో పర్యాటక రంగం గురించి ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఈ సదస్సులో వందకు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారు. వీరితో పాటు గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి లండన్‌కు బయల్దేరి వెళ్లారు.



వరల్డ్‌ట్రావెల్ సదస్సుకు బయల్దేరిన జిల్లా ఎమ్మెల్యేలు

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాణి సరళ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలోని స్టేడియం మైదానంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-19 సాఫ్ట్‌బాల్, బెస్‌బాల్, యోగా అండర్ - 14, 17, 19, హ్యాండ్‌బాల్ అండర్ - 14, 19, ఖోఖో అండర్ - 17 బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, నిరంజన్‌రావు, రాఘవేందర్, నాగరాజు, బాల్‌రాజ్, రామ్మోహన్, ఆసిఫ్, అరుణ జ్యోతి, నాగమణి, సుగుణ, సరిత పాల్గొన్నారు.

## రైతుబంధు, రుణమాఫీ అమలు చేయాలి

» గద్వాల కలెక్టరేట్ ముందు కర్నూలు రైతుల ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కర్నూలు రైతులు

గద్వాల న్యూటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఉన్న తమ భూములకు రైతుబంధు, రుణమాఫీ వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో గల వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ భూములు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దులో ఉన్నాయని, తమకు సంబంధించిన ఆధార్, రేషన్‌కార్డులు కర్నూల్ జిల్లాలో ఉన్నా భూములకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలు తెలంగాణలో జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు రైతుబంధు, రుణమాఫీ, పంట రుణాలకు సంబంధించిన అన్ని పథకాలు కూడా తమకు అమలు అయ్యేవని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో అమలు కావడంలేదన్నారు. అవి వెంటనే అమలు అయ్యేలా చూడాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రైతు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఊర్లో అందరూ.. వంట మాస్టర్లే!

## అన్నసాగర్ గ్రామం ప్రత్యేకత





భూత్పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో శుభకార్యం ఉంటే కుటుంబ పెద్దలు మాట్లాడుకునే అంశాల్లో విందు ప్రధానం. అందుకోసం ఏఏ వంటలు చేయాలి, వాటిని రుచి, శుచిగా వండే వాళ్లు ఎక్కడ దొరుకుతారనే విషయంపై విస్తృతంగా చర్చించుకుంటారు. ఎందుకంటే శుభకార్యాన్ని ఎంత ఘనంగా చేసినా, భోజనాలు సరిగా లేకపోతే బంధు మిత్రుల నుంచి విమర్శలు తప్పవు. భోజనాల తర్వాత వంటలు బాగున్నాయని వచ్చిన వారు చెప్తే ఆ కుటుంబం ఆనందానికి అవధులు ఉండవు. వంటలు రుచిగా ఉండటంలో వంట మాస్టర్ల పాత్ర కీలకం. అలాంటి వంట మాస్టర్లకు మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ గ్రామం పెట్టింది పేరు.

### ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు

అన్నసాగర్ వంట మాస్టర్లకు పెళ్లిళ్ల సీజన్లో ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే హైదరాబాద్, గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు వస్తుంటాయి. తాము వండే మటన్, చికెన్ బిర్యానీలు, మిఠాయిలకు చాలా మంచి పేరు ఉందని, అందుకే ఇతర ప్రాంతాల నుంచి కూడా ఆర్డర్లు వస్తుంటాయని సీనియర్ వంట మాస్టార్ చెన్‌రాయుడు తెలిపారు. మారుతున్న ప్రజల రుచులు, అభిరుచులకు అనుగుణంగా కొత్త వంటకాలను, పిండి వంటలను నేర్చుకుంటున్నామని ఆయన తెలిపారు.

### సీజన్‌లో చేతి నిండా పని

ఆర్డర్ మేరకు అనేక రకాల వంటలు చేసి, నోరూరించే తినుభండారాలు చేసి పెట్టినా, తమ బతుకులు మాత్రం మారడం లేదని వంట కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్లు ఉన్నప్పుడే ఉపాధి ఉంటుందని, మిగిలిన రోజుల్లో ఖాళీగా ఉండాల్సి వస్తోందని చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువులు, పెళ్ళిళ్లు చేయడం కష్టంగా మారుతోందంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### వంట మాస్టర్ రాములుతో ఆరంభం

అన్నాసాగర్ గ్రామంలో దాదాపు 500 కుటుంబాలు ఉన్నాయి. అందులో దాదాపు 70 కుటుంబాల వారు వంట మాస్టర్లుగా పేరు తెచ్చుకున్నారు. వారికి సహాయకులుగా మరో 30 కుటుంబాల వారు ఉపాధి పొందుతున్నారు. వారితో పాటు మరో 30 కుటుంబాల వారు రుమాల్ రోటీ మాస్టర్లుగా పేరు తెచ్చుకున్నారు. 1970లో గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి పాలమూరు పట్టణంలోని ఓ ప్రముఖ హోటల్‌లో వంట మాస్టర్‌గా చేరాడు. కొన్ని రోజుల తర్వాత ఆయన గ్రామానికి చెందిన చెన్‌రాయుడు, కంపిలి వెంకటయ్య, గొడుగు సత్తయ్య, సుదర్శన్‌లకు వంటలు నేర్పించాడు. అలా ఓ కుటుంబం నుంచి మరో కుటుంబం వంట వృత్తిలోకి ప్రవేశించారు. ప్రస్తుతం దాదాపు 150 కుటుంబాల వారు వంట వృత్తితో జీవనోపాధి పొందుతున్నారు.

### ఎవరూ పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో చాలా మంది వంట పనితోనే జీవనం గడుపుతున్నారు. మేము రాజకీయ నాయకుల ఇళ్లల్లో శుభకార్యాలకు కూడా వంటలు చేస్తుంటాము. అయినా మా గురించి వారెవరూ పట్టించుకోరు. మా సమస్యలు, కష్టాలపై పలుమార్లు నాయకులు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా ఫలితం లేదు. ప్రభుత్వం మాకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి, సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

- లింగంపల్లి జంగయ్య, వంట మాస్టర్



ఓ శుభకార్యంలో వంటలు చేస్తున్న సీనియర్ మాస్టర్ చెన్‌రాయుడు (ఫైల్)

### ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు



నేను 1992 నుంచి వంటలు చేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. సీజన్లో చేతి నిండా పని దొరుకుతుంది. కానీ పెద్దగా మిగులుబాటు ఏమీ ఉండదు. ఎందుకంటే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, పిల్లల స్కూలు ఫీజులకే ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుంది. అంతే కాకుండా పేద కుటుంబాలు పనికి పిలిచినప్పుడు ఎక్కువగా డబ్బు ఇవ్వరు. తోచినంత ఇస్తారు. ఏ రోజు కూడా ఇంత డబ్బు కావాలని కచ్చితంగా ఇవ్వాలని అడగలేదు. వంటలు నచ్చితే వాళ్లే కాస్తా ఎక్కువ డబ్బు ఇస్తారు.

- చెన్‌రాయుడు, సీనియర్ వంట మాస్టర్

### 60 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు ఇవ్వాలి



నేను 40 ఏళ్ల నుంచి వంటలు చేస్తూ ఉన్నాను. మాకు ప్రభుత్వం నుంచి ఏలాంటి సహాయమూ అందడం లేదు. మమ్మల్ని ప్రత్యేక కార్మికులుగా గుర్తించి 60 ఏళ్లు దాటిన వారికి పెన్షన్లు ఇస్తే బాగుంటుంది. నాకు వయసు మీరింది. వంటలు చేయడం చేతకావడం లేదు. పని చేస్తేనే డబ్బు వస్తుంది. ఇప్పుడు ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

- కంపిలి వెంకటయ్య, సీనియర్ వంట మాస్టర్

### రుచి కరమైన వంటలు చేయడమే లక్ష్యం



నేను వ్యవసాయం చేస్తాను. ఖాళీ సమయాల్లో వంటలు చేయడానికి వెళ్తాను. పెళ్లి, ఇతర శుభకార్యాల్లో వంటలు రుచికరంగా ఉంటేనే మళ్లీ ఆర్డర్లు వస్తాయి. రుచికరమైన బిర్యానీ, మాంసాహారం చేస్తే, తిన్న వారు గుర్తు పెట్టుకుంటారు. వారి చుట్టాలు, బంధువులు కూడా పిలుస్తారు. మాకు దూర ప్రాంతాల నుంచి కూడా ఆర్డర్లు వస్తుంటాయి.

- చెన్నయ్య, వంట మాస్టర్

## పాము కాటుతో వ్యక్తి మృతి



బాలయ్య (ఫైల్)

ఖిల్లాఘణపురం,నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం లోని వెంకటంపల్లి గ్రామా నికి చెందిన కొండ బాలయ్య (34) పాము కాటుతో మృతి చెం దాడు. ఎస్ఐ సురేశ్ గౌడ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలా ఉన్నాయి. గ్రామ పంచా యతీ మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్న కొండ బాలయ్య ఆదివారం రాత్రి ఇంట్లో నిద్ర పోయాడు. అర్ధరాత్రి రెండు గంటల సమ యంలో కడుపునొప్పి రావడంతో ఆయనకు మెళకువ వచ్చింది. లేచి చూసే సరికి ఇంటి గడప దగ్గర పాము కన్పించింది. దీంతో అను మానం వచ్చిన ఆయన భార్య సహాయంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ఆసు పత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెం దాడు. ఈ మేరకు అతడి భార్య కొండ కురు వమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విష యం తెలుసుకున్న మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్మికులు బాధిత కుటుంబానికి రూ.16,350 ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మృతుడి కళ్లను దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ క్లినిక్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి కళ్లను సేకరించారు.

## అయిజలో ఆన్‌లైన్ బెట్టింగ్

» రూ.1,04,860 స్వాధీనం

అయిజ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టీ. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. అయిజ పట్టణంలోని ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అం దింది. దీంతో సోమవారం సాయంత్రం స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో, అయిజ ఎస్ఐ విజయభాస్కర్ సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి చేశారు. ఆ ఇంట్లో ఐదు గురు వ్యక్తులు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారి నుంచి ఐదు సెల్ ఫోన్లు, రూ. 1,04,860 నగదు స్వాధీనం చేసుకున్నారు. అయిజ పట్టణం, రాజోలి మండలం మాన్‌దొడ్డికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## చోరీ కేసులో యువకుడి రిమాండ్

నర్వ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలను అపహరించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించినట్లు నర్వ ఎస్ఐ కుర్మయ్య సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా, నర్వ మండలం లం కాల గ్రామానికి చెందిన యాదయ్య అలియాస్ వెంకటయ్య అనే యువకుడు చుట్టుపక్కల గ్రామాల్లో గొర్రెలు, మేక లను ఎత్తుకెళ్లేవాడు. అలాగే దసరా పండగకు ముందు నర్వ మండల కేంద్రా నికి చెందిన కుర్వ మల్లప్ప మందలో నుంచి గొర్రె పొట్టేలును ఎత్తుకెళ్లి సంత లో విక్రయించాడు. ఈ మేరకు బాధితు డు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడిని నారాయణపేట కోర్టు లో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

జడ్చర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బైకుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన మహిళ, చికిత్స పొందుతూ మృతి చెందింది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేష్, ఎడ్ల లలిత(32) భార్యా భర్తలు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడున్నారు. జడ్చర్లలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న దీప్తిని కలిసేందుకు ఆదివారం వారు కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా మాచారం సమీపంలోని ఫ్లైఓవర్ చివరలో లలిత ప్రమాదవశాత్తు బైకు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందింది. ఎడ్ల లలిత సోదరుడు దుబ్బల నాగ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరుస దొంగతనాల కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధించినట్లు ఆత్మకూరు డీఎస్పీ వెంకటేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మేడపల్లి గ్రామానికి చెందిన బొల్లి సాయికుమార్ 2022, ఫిబ్రవరి 24వ తేదీన కట్ట వెంకటేశ్, నీల ప్రకాష్‌ల కిరాణా దుకాణాల్లో చోరీకి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఆత్మకూరు ఎస్ఐ రాఘవేందర్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశ పెట్టారు. నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి జానకి తీర్పు వెల్లడించారు. ఈ మేరకు బొల్లి సాయికుమార్‌ను జిల్లా జైలుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్, ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## పొలిటికల్ హీట్

(మొదటి పేజీ తరువాయి)

ఏదైనా అక్కడ అవినీతి భారీ ఎత్తున జరిగిందనే చర్చ ఉంది. ప్రభుత్వం మారిన తర్వాత ఇటీవల ఆ సర్వే నెంబర్‌లో ఉన్న కొన్ని ఇళ్లను ఆక్రమణలుగా అధికారులు గుర్తించి, కూల్చి వేశారు. అక్కడివరకు బాగానే ఉన్నా.. అక్కడ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాసట అనే పేరుతో కార్యక్రమాలు చేపట్టారు. అధికారులు కూడా అక్కడ నకిలీ పట్టాలకు కారకులు వీరే అని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఏ4గా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్ పేరును చేర్చారు. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు బెయిల్ ప్రయత్నాలు చేసినప్పటికీ.. ఫలించలేదు. దాంతో శ్రీనివాస్‌గౌడ్ తన తమ్ముడిని గత నెల 25న స్వయంగా పోలీస్ స్టేషన్ వద్ద వదిలి సరెండర్ చేయించారు. ఆ తర్వాత రోజు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తమ వద్ద అన్ని సాక్ష్యాలు ఉన్నాయని చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకులేమో తమ ప్రమేయం లేదని, అధికారులు వారి పని చేసుకుంటూ వెళ్తున్నారని చెబుతున్నారు. కేవలం ఆ బాధితులకు అండగా ఉన్నందుకే తన సోదరుడిని జైలుపాలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ములాఖత్‌లకు హాజరవుతున్నారు. 2018లోనే కేసులు నమోదయ్యాయని, ఇప్పుడు కావాలనే శ్రీకాంత్‌గౌడ్‌ను ఇరికించారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఇదిలా ఉంటే ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో బోగస్ పట్టాల విషయంలో ఇంకా బాధితులను విచారించడంతోపాటు తమ కస్టడీకి తీసుకునే ప్రయత్నాల్లో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ ఈ వివాదం కేంద్రంగా పొలిటికల్ హీట్‌ను పెంచడానికి కార్యాచరణను అమలు చేస్తోంది.

### 'సోషల్' వివాదం..

ప్రస్తుతం పార్టీల మధ్య వ్యక్తిగత ఆరోపణల కంటే సోషల్ మీడియాలో ఆ పార్టీ సోషల్ కార్యకర్తలు చేసుకునే వంగ్య కౌంటర్లు చాలా జుగుప్సాకరంగా ఉంటున్నాయి. ఏ పార్టీ అయినా సరే తమ హయాంలో చేసిన తప్పులను ఒగ్గి.. ఎదుటి పార్టీ చేసిన తప్పులనే ఎత్తి చూపడం సర్వ సాధారణమే. అయితే కొన్నిసార్లు వారి రాష్ట్ర స్థాయి బాస్‌లకు అనుగుణంగా ఉండేందుకు డోస్ పెంచాలనే ఉద్దేశంతో సోషల్ కార్యకర్తల తీరు కూడా మితిమీరిపోతోంది. ప్రతీ పార్టీకి ఇప్పుడు సోషల్ మీడియా అనేది ప్రత్యేక విభాగంగా పని చేస్తుండగా.. వారి హ్యాండిల్స్ ద్వారా పెట్టే పోస్టులపై కేసులు కూడా నమోదవుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ హయాంలో కూడా ఈ కేసుల నమోదు, దాడులు చాలా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. వనపర్తి నియోజకవర్గంలో ఎన్నికల ముందు పెట్టిన పోస్టు వల్ల పోలీసులు తనను కొట్టారని శివ అనే ఒక కార్యకర్త చెప్పాడు. ఆ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇప్పుడు తమ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేసి, దాడి చేస్తున్నారని మహబూబ్‌నగర్ వన్‌టౌన్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో పాల్గొన్న వారిలో 19 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే దీనిపై కాంగ్రెస్ ముఖ్య నాయకులు కూడా కౌంటర్లు ఇచ్చారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి తదితరులు కౌంటర్లు ఇచ్చారు.

## రియల్ డీలా

### ఉమ్మడి జిల్లాలో నిలిచిన లక్షల ప్లాట్ల క్రయవిక్రయాలు

మహబూబ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇదివరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటే రియల్టర్ల హడావుడి అంతా ఇంతా ఉండేది కాదు. ఖద్దరు దుస్తులు వేసి, మెడలో తాడులా వేలాడే చైన్, చేతికి నిండా ఉంగరాలతో ఉండేవారు. చౌరస్తాలు, టీపాయింట్‌ల వద్ద రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కస్టమర్లతో బాతకాని కొడుతూ, వ్యాపారం గురించి చర్చించుకునేవారు. రియల్టర్లు కూడా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను ప్రోత్సహించేందుకు బ్యాంకాక్, గోవా ట్రిప్‌లకు తీసుకెళ్లేవారు. రెండు మూడేళ్లుగా పరిస్థితి అంతా మారిపోయింది. రియల్‌దందా ఉల్టాపల్టా కావడంతో క్రయ విక్రయాలు తగ్గాయి. గ్రామ పంచాయతీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో రియల్ వ్యాపారానికి కష్టాలు మొదలయ్యాయి. అప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాస్త రోడ్డు ఉన్న పొలానికి రూ.లక్షల నుంచి రూ.కోట్లకు చేరిన ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గ్రామాలకు రియల్ వ్యాపారుల వాహనాలు వెళ్ళడమే తగ్గిపోయింది. భూముల బేరసారాలు నిలిచిపోవడంతో వ్యాపారులు పెట్టిన పెట్టుబడి కూడా తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. క్రమంగా భూములు, ప్లాట్‌ల ధరలు కూడా తగ్గిపోవడంతో అంతా పరేషాన్‌లో పడ్డారు. ఉమ్మడి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడి 32,641 మంది మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నారు. ఇప్పుడు వ్యాపారం సాగక వారు ఇబ్బంది పడుతున్నారు.

### 2020లో నిలిచిన జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌లు

రియల్ వ్యాపారులకు జీపీ ఆలేవుట్‌లలో మంచి లాభాలు ఉండేవి. గ్రామాలలో కాస్త రోడ్డు ఉన్న పొలాలను తక్కువ ధరకు కొని ప్లాట్‌లు చేసి విక్రయించడం వల్ల కొనుగోలు చేసిన దానికన్నా రెండింతల లాభాలు గడించేవాళ్ళు. జీపీ లేవుట్ అనుమతులకు ఖర్చు తక్కువగా ఉండటంతో జిల్లా కేంద్రాలకు 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ చూసినా వెంచర్లు వెలిశాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, జడ్చర్ల దేవరకద్ర పరిధిలో పెద్ద ఎత్తున వ్యాపారం సాగింది. అప్పటివరకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు పలికిన భూముల ధర అమాంతం పెరిగిపోయింది. రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పలకడంతో చాలామంది భూములను అమ్ముకున్నారు. వాటిని వెంచర్లుగా మార్చి, జీపీ లేఅవుట్ కింద క్రయ విక్రయాలు చేశారు. 2020 ఆగస్టు 26న అప్పటి ప్రభుత్వం జీపీలేవుట్ల రిజిస్ట్రేషన్‌లను నిలిపేసింది. అప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డబ్బులు ఇచ్చి, అగ్రిమెంట్‌లు రాసుకున్న వేలాది మంది రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. చాలామంది అగ్రిమెంట్‌లు చేసుకుని, ఆరునెలల తరువాత ధర పెరిగితే అమ్ముకోవాలని చూస్తారు. రిజిస్ట్రేషన్‌లు కాకపోవడంతో ఇవన్నీ ఆగిపోయాయి.



దివిటిపల్లి సమీపంలో వేసిన జీపీ లేఅవుట్

### వ్యాపారులతో కొనుగోలుదారుల గొడవలు

ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో రూ.లక్షలు డబ్బులు పెట్టిన వారంతో రియల్ వ్యాపారులతో గొడవకు దిగుతున్నారు. మా డబ్బులు వాపస్ ఇవ్వాలని కొందరు, పెట్టిన డబ్బులకు మిత్తి కలిపి ఇవ్వాలని మరి కొందరు వాగ్వాదం చేస్తున్నారు. ఇన్నాళ్లు.. ప్రభుత్వం జీపీ లేఅవుట్లకు అనుమతిస్తుందని చెప్పుకుంటూ వచ్చారు. గత ప్రభుత్వం బంద్ చేసిన జీపీ లేఅవుట్లకు అనుమతిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పడంతో ప్రభుత్వం మారితే అన్నింటికీ రిజిస్ట్రేషన్‌లు అవుతాయని వ్యాపారులు భావించారు. ప్రభుత్వం మారి 10 నెలలు దాటినా ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రియల్ వ్యాపారులు కస్టమర్లకు నచ్చజెప్పలేక గొడవలు జరుగుతున్నాయి. అప్పుడు తీసుకున్న డబ్బులు ఇవ్వాలంటే వెంచర్ డెవలప్‌మెంట్‌కు డబ్బులు ఖర్చు చేశామని, ఇప్పుడు మీ డబ్బులు ఎక్కడినుంచి తెచ్చివ్వాలని వ్యాపారులు బదులిస్తున్నారు.

### అనుమతిస్తే పెరుగనున్న ఆదాయం

జీపీ లేఅవుట్లను అనుమతించకపోగా ఎల్ఆర్ఎస్ తీసుకురావడంతో రియల్ వ్యాపారం మరింత పతనమైంది. పదేళ్ల క్రితం రూ.50 వేల నుంచి రూ.60 వేలకు ప్లాట్‌లు కొనుగోలు చేస్తే ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కే రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఖర్చవుతుండటంతో ఎలా చెల్లించాలని జనం వాపోతున్నారు. జీపీ లేఅవుట్‌లకు అనుమతిచ్చి, ఎల్ఆర్ఎస్ 100-200 గజాలలోపు ప్లాట్లకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు నిర్ణయించాలని, ఇలా చేస్తే పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్‌లు జరిగి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పలువురు అంటున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

ఇంటర్వ్యూ..



## సిబ్బంది సహకారంతో సమస్యల పరిష్కారం

**- పదర తహసీల్దార్ సురేష్‌బాబు**

పదర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ మండలం ఏజెన్సీలో ఉంది. రిజిస్ట్రేషన్లు కావు. కేవలం సక్సేషన్‌లు, మ్యూటేషన్లు మాత్రమే అవుతాయని తహసీల్దార్ సురేష్ బాబు సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**గ్రామాల్లో పౌర హక్కుల దినం నిర్వహిస్తున్నారా?**

గ్రామాల్లో పౌర హక్కుల దినం నిర్వహించి, అవగాహన కల్పిస్తున్నాం. అందులో భాగంగానే ఇటీవలే వంకేశ్వరం గ్రామంలో నిర్వహించాం.

**స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలున్నాయా?**

ప్రస్తుతానికి లేదు. అన్ని శాఖలను పర్యవేక్షణ చేసే బాధ్యత మాదే. అది మా సిబ్బంది సహకారంతో పకడ్బందీగా చూస్తున్నాం.

**ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తున్నారా?**

ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నాం. వచ్చిన ఫిర్యాదులు మా ఆధీనంలో ఉన్నవాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

**ధరణితో ఇబ్బందులున్నాయా?**

చాలా ఇబ్బంది ఉంది. ప్రతీ చిన్న విషయానికి కలెక్టరేట్‌తో పాటు, సీసీఎల్ తిరగాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

న్యూస్ బాక్స్

### సగర సంఘం కమిటీ ఎన్నిక

తెలకపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్వతాపూర్, రాకొండలో జిల్లా సగర సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీను ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, మొల్ల బాబుసాగర్, కొమ్ముల శ్రీను, వెంకటేశ్‌సాగర్, లక్ష్మయ్య, కాశీనాథ్ పాల్గొన్నారు.

### ధర్మయుద్ధ సభను విజయవంతం చేయాలి

తిమ్మాజిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7న నిర్వహించే మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం దానం జగన్‌రాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మందకృష్ణ మాదిగకు ఘనంగా స్వాగతం పలికేందుకు గ్రామాల వారీగా తరలి రావాలన్నారు.

### వచ్చే నెల 7న నిరసన దీక్ష

నాగర్‌కర్నూల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను సత్వరం పూర్తి చేయాలని డిసెంబరు 7న నిరసన దీక్ష చేపట్టనున్నట్లు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టర్లతో ప్రభుత్వం కుమ్మక్కు కావడంతో కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి న్యాయం జరగడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా అభివృద్ధి ఎంత మాత్రం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై రాష్ట్ర వ్యాప్తంగా భరోసా యాత్ర నిర్వహిస్తానని పేర్కొన్నారు.

### రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

తెలకపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి లభించింది. సమగ్ర శిక్షక్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కళా ఉత్సవ్-2024 పోటీల్లో భాగంగా సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్, హైదరాబాద్‌లో ఈ నెల 1, 2వ తేదీల్లో నిర్వహించిన మైమ్ పోటీల్లో శాంతినికేతన్ విద్యాలయం పదో తరగతికి చెందిన వినోద్‌కుమార్, భరత్, అజయ్‌గౌడ్, 9వ తరగతికి చెందిన చరణ్‌తేజ్, జశ్వంత్‌రెడ్డి పాల్గొని రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం దక్కించుకున్నారు.

### ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు

కోడేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఉపాధ్యాయులకు సోమవారం మండల విద్యాధికారి భాస్కర్‌శర్మ పాఠశాలలను కేటాయించి ఆర్డర్ కాపీని ఇచ్చారు. మండలానికి స్పెషల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా రెండు పాఠశాలలకు ఎస్జీటీ పోస్టులు మంజూరు చేయగా ఒకటి యూపీఎస్ పస్పుల, రెండవది పీఎస్ కొండ్రావుపల్లికి కేటాయించినట్లు ఎంఈవో తెలిపారు.

### సర్వేకు సహకరించాలి

తిమ్మాజిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుమ్మకొండలో 6న నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి హేమలత తెలిపారు. మండలంలోని గుమ్మకొండ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామస్థులతో మాట్లాడారు. ప్రతి ఇంటి యజమాని సర్వేకు కావాల్సిన కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, భూమి ఉన్నట్లయితే పట్టాదారు పాసు పుస్తకం అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామానికి సంబంధించిన వారు ఎవరైనా వలసలో ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు.

# నిరుపయోగంగా బస్టాండ్

**-ప్రయాణికులకు ఇక్కట్లు**

**-వాడుకలోకి తేవాలంటున్న ప్రజలు**



చిట్లంకుంట గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

పదర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదో ఒక పని మీద ప్రజలు బస్సు ప్రయాణం చేస్తుంటారు. ఈ మధ్యకాలంలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల మహిళలు బస్సు ప్రయాణాలు ఎక్కువగా చేస్తున్నారు. అయితే ప్రయాణించే క్రమంలో ఎండ, వానలకు ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆయా గ్రామాల వద్ద ప్రభుత్వం బస్టాండ్‌లు నిర్మించింది. మండలంలో పది పంచాయతీలున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని సుమారు ఏడు గ్రామాల్లో బస్టాండ్ వసతి లేక ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవతుఉన్నారు. ఇందుకు భిన్నంగా బస్టాండ్ వసతి ఉన్నప్పటికి కొన్ని చోట్ల వాటిని ఇతరులు వారి అవసరాల కోసం సొంత సామాన్లు పెట్టుకుని ఉపయోగించుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. అంతే కాకుండా అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని చిట్లంకుంటలో బస్టాండ్ ఎదుట ఓ హోటల్ ఉండటం వలన అక్కడ బస్టాండ్ ఉన్నట్లు ప్రయాణికులకు కనిపించదని గ్రామస్థులు వాపోతున్నారు. పలుమార్లు ఇంతకు ముందు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ వాడుకలోకి తేవాలని గ్రామస్థులు, మద్దిమడుగు వెళ్లే భక్తులు కోరుతున్నారు.

**బస్టాండ్‌ను వాడుకలోకి తేవాలి**

మా ఊర్లో బస్టాండ్ కనిపించదు. అడ్డు తొలగించి వాడుకలోకి తెస్తే బాగుంటుంది. మహిళలు బయట నిలబడాలంటే మరింత ఇబ్బందిగా ఉంటుంది.

- పాలేష్ యాదవ్, చిట్లంకుంట

**ఫిర్యాదులు వచ్చాయి**

గ్రామస్థుల నుంచి ఫిర్యాదులొచ్చిన వెంటనే హోటల్ తీసేయమని ఆదేశించాం. ఇప్పటికి చాలా రోజులైంది. ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - రామాంజనేయులు, కార్యదర్శి, చిట్లంకుట

## టీచర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కోడేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో హిందీ టీచర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజేష్ కోరారు. సోమవారం విధుల్లోకి తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి వినతిపత్రం ఇచ్చారు. కొన్నేళ్ల నుంచి పాఠశాలలో పని చేస్తున్న ప్రైవేట్ హిందీ టీచర్‌ని తొలగించడం విచారకరమన్నారు. ఈ మధ్య ఉపాధ్యాయుల బదిలీలో ఈ పాఠశాలకు రెగ్యులర్ టీచర్ రావడంతో ప్రైవేట్ టీచర్‌ని తొలగించడం జరిగిందన్నారు. ఐదు క్లాసుల విద్యార్థులకు విద్యాబోధన చేయడం సాధ్యం కాదని, విద్యార్థులకు న్యాయం చేయలేరని తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, శ్రీకాంత్, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయ డెయిరీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దొడ్ల నర్సయ్య యాదవ్

అచ్చంపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రం కార్యాలయంలో చైర్మన్‌గా దొడ్ల నర్సయ్య యాదవ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్లేష్, గౌరీ శంకర్, కావన్న యాదవ్‌తో పాటు పలువురు శాలువాతో సత్కరించారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే వంశీకృష్ణకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పాల ఉత్పత్తితో పాటు రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్సీ



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని 18, 19 వార్డుల్లో రూ.1.20 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పట్టణంలోని 18, 19 వార్డుల్లో ఐదు ప్రాంతాల్లో సీసీ రోడ్లను వేస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు ఎక్కడైనా తగ్గితే ఆయా ప్రదేశాల్లోని ఇంటి యాజమానులను ఒప్పించి వేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, బచ్చన్న, కావలి శ్రీను, సునేంద్ర, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 'అన్యాయం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దళిత రైతులకు అన్యాయం చేసిన బోనాసి రాంచందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిమ్మాజిపేట మండలం మారేపల్లి చెందిన ఎస్.బాలనాగయ్య, బొర్ల భీముడు, ఇప్పలపల్లి ఆంజనేయులు, పసుల మాసయ్య, అంకూరి మన్యం శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఎస్పీ స్పందించి బోనాసి రాంచందర్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుదర్శన్, ఎస్.శ్రీరాములు, కృష్ణయ్య, వెంకటయ్య, శేఖర్, ఎస్.రాములు, ఎస్.మల్లయ్య పాల్గొన్నారు.

## వీవోఏల సమస్యలపై ఆందోళన



వెల్దండలో ఆందోళన చేస్తున్న వీవోఏలు

తెలకపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండల కమిటీ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి ఇన్సెంటివ్ ఇవ్వాలని, గ్రామ సంఘం నుంచి రూ.మూడు వేల వేతనం ఇప్పించాలని, 20లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని, వీవోఏల రెన్యూవల్‌ను ఎత్తివేయాలని ట్యాబ్, నెట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మండల వీవోఏలు ఏపీఎం నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు.

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం వీవోఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు గండు వెంకటయ్య, కోశాధికారి జగన్‌మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల మహిళా సమైక్య కార్యాలయం ఎదుట వీవోఏలు ధర్నా నిర్వహించారు. ఆకారం నాగరాజు, గోపాల్, ప్రవీణ్, హరిప, నవనీత, సురేఖ, రజని, నీలమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి : వీవోఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఏపీఎం మంతమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, వసంత, వెంకటస్వామి, మురళీ, మధు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ : న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట వీవోఏలు ఆందోళన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీఎం రాములుకు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మణిపాల్, వసంత, జహేదా, జ్యోతి, సత్యవతి, సునీత తదితరులు ఉన్నారు.

తిమ్మాజిపేట : కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుమలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. రాజు, జ్యోతి, నర్మద, లక్ష్మి, మౌనిక, అనిత తదితరులు పాల్గొన్నారు.

వంగూరు : పెండింగ్‌లో ఉన్న వీవోఏల ఇన్సెంటివ్ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం చంద్రయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రామస్వామి, రాజేందర్, లక్ష్మి, జంగయ్య, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యలపై ఫిర్యాదు

వెల్దండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యూ నాయకులు ప్రజావాణిలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ వసతిగృహానికి పెయింటింగ్ చేయించాలని, మినరల్ వాటర్ అందించాలని, గిరిజన బాలికల కళాశాల హాస్టల్‌కు ప్రహరీగోడ నిర్మించాలని, నాణ్యమైన భోజనం అందించాలని, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సంతోష్, మల్లేష్, చింటూ, స్పందన, శైలజ, కీర్తి తదితరులు ఉన్నారు.

### వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఊర్కొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊర్కొండపేట రైతువేదికలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో మానస, ఐకేపీ సీసీ సునీల్‌కుమార్‌రెడ్డి, మాధవి, నర్సిరెడ్డి, వహీద్, చంద్రయ్య, శివ కుమార్, మల్లేష్, అరవింద్‌గౌడ్, అలీ తదితరులు ఉన్నారు.

### పేదలకు ఆసరా సీఎంఆర్ఎఫ్

పెద్దకొత్తపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు ఆసరాగా ఉంటుందని పెద్దకొత్తపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు దండు నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్యలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన దాదే చంద్రయ్యకు రూ. 60వేలు, దండు రాములుకు రూ. 37,500, ధనలక్ష్మికి రూ. 25వేల చెక్కులను అందజేశారు.

### రోడ్డుకిరువైపులా కంపచెట్ల తొలగింపు

వెల్దండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్ నుంచి కుప్పగండ్లకు వెళ్లే రహదారిలో బీటీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయి రాకపోకలకు ఇబ్బందులు కలగడంతోపాటు ప్రమాదకరంగా మారడంతో పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్ స్పందించారు. తనవంతుగా యంత్రాలను ఉపయోగించి సోమవారం చెట్లను తొలగించారు.

ఊర్కొండ: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దండోత్కర్ వెంకోజీ తన సొంత ఖర్చులతో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఊర్కొండ పరిధిలోని కంప చెట్లను సోమ వారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై మూల మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున్న సొంత ఖర్చులతో కంపచెట్లను తొలగించామని పేర్కొన్నారు.

### పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్

లింగాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన వంశీ శుక్రవారం రాత్రి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. విధులను ఆటంకం కలిగించిన అతనిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం అచ్చంపేట కోర్టులో హాజరు పరచగా పది రోజుల పాటు రిమాండ్ తరలించినట్లు వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శికి సన్మానం

ఊర్కొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా యాదయ్య గౌడ్ ఎన్నిక కావడంతో సోమవారం మండల కేంద్రంలో శాలువా, పూలామాలతో నవభారతి అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలం పలువురు విద్యార్థులకు క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సాహించిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, జబ్బార్, రాజిరెడ్డి, సందీప్, కిట్టు, హరీష్, శేఖర్, శ్రీశైలం, చందు, ఆనంద్, బాలరాజు, ఆంజనేయులు, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

**- అడిషనల్ ఎస్పీ రామేశ్వర్**

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదుదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి 13 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. న్యాయం గురించి మూడు, భూ సమస్యలపై తొమ్మిది, భార్యాభర్తల సమస్య ఒక ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**- మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రజలందరూ కృషి చేయాలి**

**- అడిషనల్ ఎస్పీ రామేశ్వర్**



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రామేశ్వర్

తెలకపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చట్టం ముందు అందరూ సమానులేనని, గ్రామాల్లో నేటికీ కొనసాగుతున్న మూఢనమ్మకాల నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని తాళ్లపల్లిలో న్యాయ సలహాలు సైబర్ క్రైమ్ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొంత మంది యువకులు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, వాటి వల్ల సమాజంలో అశాంతి ఏర్పడి సమాజంలో గౌరవం తగ్గి శిక్షలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా కుటుంబసభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మూఢనమ్మకాల వల్ల తప్పుడు నిర్ణయాలతో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఇటీవల జరుగుతున్న కొన్ని నేరాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ కనకయ్య, ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణికి 49 వినతులు



వినతిపత్రాలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణికి మొత్తం 49 వినతులు వచ్చాయి. పలు సమస్యలపై ప్రజల నుంచి అందిన వినతులను రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు పరిశీలించి విచారణ కోసం సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. వినతుల్లో ధరణికి సంబంధించి 21 ఉండగా, రెవెన్యూ 17, జిల్లా పంచాయతీకి మూడు, ఉపాధి కల్పనకు రెండు, విద్యాశాఖ రెండు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, డీసీవో శాఖలకు ఒక్కో ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి సమస్యలు తక్షణమే పరిష్కరించడంతో పాటు క్షేత్రస్థాయి వాటిని విచారణ కోసం సంబంధిత మండలాలకు బదిలీ చేసి పరిష్కారం అయ్యేదాక పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజావాణి వినతులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, కలె క్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలి



తహసీల్దార్ ఇబ్రహీంకు వినతి ఇస్తున్న లబ్ధిదారులు

కల్వకుర్తి, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): డబల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారని, ఇప్పటికి 18 నెలలు గడుస్తున్నా ఇళ్లు ఇవ్వలేదని తెలిపారు. పనులు పూర్తిస్థాయిలో కాలేదని, నీటి ట్యాంకుల నిర్మాణం, విద్యుత్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తస్లీమ్‌బేగం, జూలేక బేగం, పార్వతమ్మ, కృష్ణవేణి, జయమ్మ, దాస్య, శ్రీనివాసులు, అరుణ్, బాలకృష్ణ, మైనోద్దీన్, సుభాన్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

### 'ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం'

కొల్లాపూర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్‌వీ నాయకుడు శేఖర్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఏడాది అవుతున్నా కొత్త ఉద్యోగాల కల్పనపై ఒక్క సమీక్ష జరపలేదన్నారు. తక్షణమే హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

### మాజీ సర్పంచ్‌ల అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పలువురు సర్పంచ్‌లను అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు ఎస్ఐ గోవర్దన్ సోమవారం తెలిపారు. రెండేళ్లుగా సర్పంచ్‌ల నిధుల విడుదల చేయకపోవడంతో సర్పంచ్‌ల సంఘం సెక్రటేరియేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని నల్లవెల్లి, నర్సాయిపల్లి, గుడిపల్లి, వనపట్ల, శ్రీపురం మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టినట్లు ఎస్ఐ తెలిపారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వీరిని బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### బిల్లులు చెల్లించాలి

కల్వకుర్తిటౌన్: పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింగం విజయ్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ బిల్లులకై నిరసన చేస్తున్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడం తగద న్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

### ఉమామహేశ్వరంలో అయ్యప్ప మాలధారణ



ఉమామహేశ్వరం ఆలయం వద్ద అయ్యప్ప భక్తులు

పదర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన 25 మంది అయ్యప్ప భక్తులు సోమవారం ఉమా మహేశ్వరాలయంలో అయ్యప్ప మాలాధారణ చేపట్టారు. ఈ సందర్భంగా మండి అంజయ్య, పాండు, చారి మాట్లాడుతూ.. మాలాధారణ చేపట్టిన భక్తులు 41 రోజులు నియమ, నిష్టలతో ప్రార్థనలు చేస్తారని పేర్కొన్నారు.

### పీహెచ్‌సీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

కోడేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ అదనపు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. సోమవారం రోగులు పీహెచ్‌సీకి వెళ్లగా మధ్యాహ్నం 12 గంటలు అయినా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

### 'దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి'

ఊర్కొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్ సోమవారం తహసీల్దార్ రామ్‌కోటికి వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులు జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తమకు ఐదు శాతం వాటాగా ఇందిరమ్మ గృహాలను కేటాయిస్తే ధైర్యంగా జీవనం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్ తదితరులు ఉన్నారు.